## క్లుప్తంగా

### ట్యాంక్‌ను శుభ్రం చేశారు

సాక్షి ఎఫెక్ట్


శుభ్రం చేసిన వాటర్ ట్యాంక్

వీర్నపల్లి: మండలంలోని సీతారాంనాయక్ తండా పరిధిలో హిక్యానాయక్ తండాలో ప్రజలు తాగునీటికి పడుతున్న ఇబ్బందులపై బుధవారం 'రక్షిత మంచినీరు కరువు' అనే శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించి మంచినీటిని అందిస్తున్నారు. దీంతో తండా ప్రజలు సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

### రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తాం


నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన సంఘం

కోనరావుపేట: మండలంలోని రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తామని రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ మిర్యాల పురుషోత్తంరావు అన్నారు. కోనరావుపేట మండలం చాందనగర్(నిజామాబాద్)లో మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన 300 మంది రైతులతో ఈ సంఘాన్ని ఏర్పాటు చేసిన కేంద్ర సహకార చట్టం పరిధిలో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. ఈ సంఘం ద్వారా రైతులకు నాణ్యమైన వరి విత్తనాలు రాయితీపై, పురుగుల మందులు, ఎరువులు అందిస్తామన్నారు. అలాగే పనిముట్లు, హార్వెస్టర్లు తక్కువ ధరకు అద్దెకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జవ్వాజి తిరుపతిగౌడ్, సాసాల శ్రీనివాస్, తీగల రామచంద్రం, నేరెళ్ల భాగ్యలక్ష్మి, చిలుక స్వప్న, జలగం కిరణ్, భాస్కర్‌రావు, జినుక వెంకటి, రైతులు పాల్గొన్నారు.

### విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి


మరిమడ్లలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కోనరావుపేట: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఈ నెల 11న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న మాదిగ, మాదిగ ఉపకులాల మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎలగందుల భిక్షపతి కోరారు. కోనరావుపేటలో మండలంలోని గ్రామాల్లో గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 2004 నుంచి 2014 వరకు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ఎస్సీ వర్గీకరణ చేస్తామని చివరి వరకు చెబుతూనే మోసం చేసిందన్నారు. 30 ఏళ్ల ఉద్యమానికి గుర్తుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి, జిల్లా నాయకులు తాళ్లపెల్లి ప్రభాకర్, గొర్రె శ్రీనివాస్, లింగంపెల్లి జాన్, మాట్ల దేవయ్య, దప్పుల రాజయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

**తంగళ్లపల్లిలో..**

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద గురువారం విశ్వరూప మహాసభ వాల్‌పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బొల్లారం చంద్రమౌళి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పసుల సుధాకర్, భీష్మకుమార్, కమలాకర్, జీవన్, జంగపల్లి రాజు, బూడిద శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అటెన్షన్ ప్లీజ్




### వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో నివాసాలు, పాఠశాల భవనాలపై, ప్రధాన రహదారుల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్న సెస్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఇవి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పాఠశాలల భవనాలపై వేలాడుతున్న వైర్లతో విద్యార్థులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: పృథ్వీధర్‌గౌడ్, సెస్ ఏఈ, ఎల్లారెడ్డిపేట
సెల్ నంబర్: 94408 14081



### ఎక్కడచూసినా చెత్తకుప్పలే..

ముస్తాబాద్: ముస్తాబాద్ పట్టణంలో ఎక్కడచూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ముస్తాబాద్ నుంచి పోతుగల్, నామాపూర్ వెళ్లే రహదారులు చెత్తకుప్పలతో కంపుకొడుతున్నాయి. ముస్తాబాద్‌లో పారిశుధ్యం బాగానే ఉన్నా శివారులో ఇలా చెత్త వేస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించడంలో పంచాయతీ అధికారులు అశ్రద్ధ చేస్తున్నారని శివారు రహదారులపై చెత్త, చికెన్ వ్యర్థాలు, హోటళ్ల వ్యర్థాలు చూస్తేనే అర్థమవుతుంది.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, ముస్తాబాద్
సెల్ నెంబర్: 95155 75186

# సమస్యలతో సతమతం

- ప్రారంభం కాని పనులు
- ప్రమాదానికి కారణమవుతున్న రోడ్లు
- చొరవ చూపితే సమస్యలు పరిష్కారం


ఈ ఫొటో గంభీరావుపేట మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం. ఈ భవనాన్ని ప్రారంభించారు. కానీ ఇప్పటికీ వినియోగంలోకి తేవడం లేదు. అందుకు కారణాలేమైనా దీనివల్ల ప్రజలు వైద్యానికి దూరమవుతున్నారు. ఇప్పటికైనా చొరవ తీసుకొని వినియోగంలోకి తేవాలని మండల కేంద్రం ప్రజలు కోరుతున్నారు.


గంభీరావుపేట మండల కేంద్రం


సీతారాంబజార్‌లో మిషన్ భగీరథ కోసం తవ్వి వదిలేసిన సీసీ రోడ్డు

గంభీరావుపేట: మండల కేంద్రంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు కాస్త చొరవచూపితే సమస్యలు పరిష్కారం కానున్నాయి. కొన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. కొన్ని ఎన్నికల కోడ్ కారణంగా మొదలు కాలేదు.

➡ మండల కేంద్రంలో ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణం కోసం ఇటీవల రూ.30 కోట్లు మంజూరయ్యాయి. డ్రెయినేజీలు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ పనులకు శంకుస్థాపన చేశారు. ఇంతలో ఎన్నికలు వచ్చేశాయి. దీంతో పనులు మొదలు కాలేదు.

➡ గంభీరావుపేట ప్రధాన కూడలిలో ఉన్న పాత గ్రామపంచాయతీ కార్యాలయాన్ని, మార్కెట్ యార్డును తొలగించారు. సమీకృత మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ ప్రారంభం కాలేదు.

➡ మండల కేంద్రంలో ప్రధాన రోడ్లతో పాటు వీధుల్లో మిషన్ భగీరథ కోసం సీసీ రోడ్లు పగులగొట్టారు. తిరిగి సరిచేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రధాన రోడ్లపై ఏర్పడిన గుంతలతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

➡ మిషన్ భగీరథ ద్వారా పట్టణంలో పూర్తిస్థాయిలో నీటి సరఫరా కావడం లేదు.

➡ గ్రామ శివారులోని గంగమ్మ చెరువులోకి ఊళ్లోని మురుగు నీరు చేరి చెరువులోని నీరు కలుషితమవుతోంది. కలుషితం కాకుండా సైడ్ డ్రెయినేజీ నిర్మించినప్పటికీ దానిని పూర్తిస్థాయిలో వినియోగపడేలా నిర్మించలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

➡ మండల కేంద్రంలో గాంధీచౌక్, దోసలగూడెం ఏరియాలో గతంలో ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి కేంద్రాలు మూతపడ్డాయి. వాటిలోని సామగ్రి తుప్పుపట్టి పోతున్నాయి. వాటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

➡ గంభీరావుపేట, లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై నూతనంగా హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. పాత బ్రిడ్జి ఉండగానే, కొత్త బ్రిడ్జి నిర్మించాలని లేని పక్షంలో నిర్మాణ సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్తులు అంటున్నారు.

➡ గ్రామంలో కోతులు, పందుల బెడద తీవ్రంగా ఉంది. ప్రజలు బయటికి రావాలంటేనే జంకుతున్నారు. నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

➡ గంభీరావుపేట నుంచి నర్మాల గ్రామానికి వెళ్లే దారిలో ముళ్లపొదలు, చెట్లు పెరిగి రోడ్డును కప్పేశాయి. ప్రమాదకరంగా మారిన వాటిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

### సమస్యలను పట్టించుకోవాలి



మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. మిషన్ భగీరథ కోసం తవ్విన సీసీ రోడ్లను పూడ్చి వేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవాలి. చెరువు నీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మేకార్తి శ్రీనివాస్, గంభీరావుపేట

### ఫోర్‌లేన్ రోడ్డు కోసం ఎదురుచూస్తున్నాం



గంభీరావుపేటలో ఫోర్‌లేన్ రోడ్డు కోసం నిధులు మంజూరు చేశారు. పనులకు శంకుస్థాపన చేశారు. ఇంకా పనులు ప్రారంభం కాలేదు. పనుల కోసం ఎదురుచూస్తున్నాం. రోడ్డు విస్తరణ జరిగితే గంభీరావుపేటలో ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి. కూరగాయల మార్కెట్‌లో విక్రయ, కొనుగోలుదారుల కష్టాలను పట్టించుకోవాలి.

– రాగిశెట్టి నారాయణ, గంభీరావుపేట




### చంద్రయాన్ రాకెట్ నమూనా అందజేత

ముస్తాబాద్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రదర్శించిన చంద్రయాన్ రాకెట్ నమూనాను మండలంలోని ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు దుర్గాయూత్ సభ్యులు శుక్రవారం అందజేశారు. రూ.50 వేల వ్యయంతో తయారు చేసిన ఈ నమూనా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించేటప్పుడు ఉపయోగపడుతుందన్నారు. ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ రాకెట్ విజయవంతమై, ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు వచ్చిన గుర్తింపును వివరించారు. హెచ్ఎం శారద, పీఈటీ సురేశ్, ఉపాధ్యాయులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం దళారుల పాలు

- ఆగని ప్రైవేటు కొనుగోళ్లు
- తక్కువ ధరకే విక్రయాలు
- ఇబ్బడి ముబ్బడిగా దోపిడీ


వట్టెంలలో రోడ్డు పక్కన ధాన్యం కొనుగోలు చేస్తున్న దళారి

వేములవాడరూరల్: ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా, పల్లెల్లో ప్రైవేటు కొనుగోళ్లు ఆగడం లేదు. వ్యాపారులు, రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. వేములవాడ మండలంలోని వట్టెంల, ఫాజుల్‌నగర్, నూకలమర్రి గ్రామాల్లో ప్రైవేటు వ్యాపారులు కల్లాల వద్ద రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. పెట్టుబడుల కింద రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద ముందస్తుగా తీసుకున్న రుణాలకు గాను ధాన్యం తనకే విక్రయించాలనే డిమాండ్‌తో విక్రయాలు చేస్తున్నట్లు తెలిసింది. ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరగా క్వింటాల్‌కు రూ.2,200 ఉండగా ప్రైవేటు వ్యాపారులు రూ.1,700కు క్వింటాల్ చొప్పున రైతుల వద్ద కొంటూ అన్యాయం చేస్తున్నారు. ఇలాంటి విధానాలపై క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఉదాసీనంగా ఉండడంతో దళారుల ఇబ్బడి, ముబ్బడిగా దోచుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. తక్కువ ధరకు ధాన్యం అమ్మని పక్షంలో ముందస్తుగా అవసరమైన ఎరువులు, విత్తనాలు అందించమని కొర్రీలు పెడుతున్నట్లు ఓ రైతు వాపోయాడు.

# మందుబాబులకు అడ్డాగా ప్రకృతివనం

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో పల్లెప్రకృతి వనం మందుబాబులకు అడ్డాగా మారుతోంది. కనగర్తి ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో, పక్కన కొన్ని రోజులుగా కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సేవించి, సీసాలను అక్కడే పడేస్తున్నారు. పల్లె ప్రకృతి వనానికి రక్షణగా ఏర్పాటు చేసిన కంచెను కూడా గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పాఠశాల మైదానంలోకి విద్యార్థులు, యువకులు ప్రతిరోజూ తెల్లవారుజామున మార్నింగ్ వాక్‌కు వెళుతుంటారు. పగిలిన సీసాలు గుచ్చుకుని విద్యార్థులు, యువకులు ప్రమాదానికి గురవుతున్నారు. కొన్ని రోజులుగా పోలీసులు రాత్రి వేళలో గస్తీ లేక మందుబాబుల ఆగడాలు ఎక్కువ అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.


కనగర్తి ప్రకృతివనం వద్ద పడేసిన మద్యం సీసాలు

### పిచ్చికుక్కల స్వైరవిహారం

కోనరావుపేట: మండలంలోని కనగర్తి గ్రామంలో కొంతకాలంగా పిచ్చికుక్కల స్వైర విహారం ఎక్కువ అవుతోంది. రహదారి వెంట వెళ్లే చిన్నారులపై, వాహనదారులపై దాడికి ప్రయత్నిస్తున్నాయి. గ్రామానికి చెందిన బొల్లు బాలయ్యకు చెందిన బర్రెను కుక్కలు కరవడంతో బర్రెకు రేబిస్ వ్యాధి సోకినట్లు గుర్తించారు. కనబడిన వారిపై దాడికి ప్రయత్నిస్తుండడంతో బర్రెను చెట్టుకు కట్టేశారు. గ్రామంలో కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కొంతకాలంగా కోరుతున్నారు.

### శ్మశానవాటిక నిర్వహణలో నిర్లక్ష్యం


మాట్లాడుతున్న శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠధామంలో మౌలిక వసతుల కల్పనలో అంతులేని నిర్లక్ష్యం నెలకొందని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెస్ అధికారులు నాలుగు రోజుల క్రితం విద్యుత్ సరఫరా తీసేసినా, పునరుద్ధరింపజేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. దహన సంస్కారాల కోసం రూ.7,500 తీసుకుంటున్న మున్సిపల్ నుంచి వసతుల కల్పనలో లోపాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ మంత్రి కేటీఆర్ ఇలాకాలో ఇటువంటి నిర్లక్ష్య ధోరణి ఏంటని ప్రశ్నించారు. అయిన వారిని పోగొట్టుకుని తీరని శోకంతో దహన సంస్కారాలకు వచ్చే వారిపై కనికరం లేకుండా వ్యవహరించడం సరికాదన్నారు. కలెక్టర్ వెంటనే ఈ విషయంలో కల్పించుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు మల్లాజి, సత్యనారాయణ, గణేష్, దేవదాసు, ప్రతాప్ పాల్గొన్నారు.

### విద్యా ప్రమాణాలను పెంచేందుకు తొలిమెట్టు

వేములవాడఅర్బన్: ప్రాథమిక విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తమ వంతు కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో పిల్లల కోసం తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కరోన కారణంగా ప్రాథమిక విద్యా ప్రమాణాలు బాగా దెబ్బతిన్నాయన్నారు. ఆ ప్రమాణాలు పెంచేందుకు వలంటీర్లను ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రతి శనివారం ఒక గంట పాటు అయా పాఠశాలల విద్యార్థులకు వివిధ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి. శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### సీనియర్ సిటిజన్లకు వైద్య పరీక్షలు

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రంలోని ఆల్ సీనియర్ సిటిజన్ల సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వస్త్ర వ్యాపార సంఘం భవనంలో పలువురు వయో వృద్ధులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ యాదగిరిగౌడ్, ఠాకూర్ ఘన్‌శ్యామ్ పరీక్షలు నిర్వహించిన అనంతరం ప్రభుత్వం పంపిణీ చేసిన వినికిడి పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, కార్యదర్శి జనపాల శంకరయ్య, వ్యాపార సంఘం కార్యదర్శి గౌడ రాజు, సీనియర్ సిటిజన్ల సంఘం ప్రతినిధులు దొంత దేవదాస్, గజ్జెల్లి రామచంద్రం, ఏనుగుల ఎల్లయ్య, నక్క మనోహర్, మిట్టపల్లి రాములు పాల్గొన్నారు.

### ఓటుహక్కు వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

చొప్పదండి: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వశక్తి గ్రూపు మహిళలకు గురువారం ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈసందర్భంగా శాంతికుమార్ మాట్లాడుతూ.. ఓటుహక్కుపై ఏమైనా సందేహాలుంటే 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో కులం, మతం, జాతి, వర్గం, భాష, ఒత్తిడి ప్రభావితం కాకుండా ఎన్నికల ప్రశాంతతను కాపాడుతూ నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, డీఎంసీ శ్రీవాణి, మానస, రవిందర్, అంజయ్య, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.